క్లుప్తంగా

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'



వీపనగండ్ల: కంటివెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అంధత్వ నివారణకు దోహదపడుతుందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం రంగవరంలో సర్పంచ్ వేముల జయసుధతో కలిసి కంటి వెలుగు క్యాంపును ఆయన ప్రారంభించారు. ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడమే కాక అవసరమైన వారికి కంటి అద్దాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలశేషు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంబలి కేంద్రాలతో బాటసారులకు ఉపశమనం



అమరచింత: మండు వేసవిలో బాటసారులకు, ప్రయాణికులకు అంబలి కేంద్రాలు ఉపశమనం కలిగిస్తున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీలన్‌గౌడ్ అన్నారు. పట్టణంలో శబరినాథ్‌గౌడ్, అక్షయ జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎం లో సుదూర ప్రాంతాల నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్తున్న ప్రయాణికులు అంబలి కేంద్రాల్లో ఉచితంగా అందిస్తున్న అంబలిని తాగి ఉష్ణతాపం నుంచి తప్పించుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం వేసవిలో చలివేంద్రంతో పాటు అంబలి కేంద్రం నిర్వహిస్తున్న కమలాకర్‌గౌడ్, పురోషోత్తంగౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో తిరుమలేష్, వెంకటేష్, నామాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో శుక్రవారం శటమోని రాముడు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, కుమ్మరి గోవిందు, విష్ణు, చందు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం



వనపర్తి టౌన్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 27, 28వ తేదీల్లో నిర్వహించే 'పాటకు పట్టాభిషేకం' కవి సమ్మేళనానికి హాజరు కావాలని నిర్వాహకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాలకు కవులు, గాయకులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, నాగేంద్ర సాగర్, గిరి రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కాల్వలో మట్టి తొలగింపు



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 31వ వార్డు కొత్తకోట రోడ్డులోని పెద్ద కాల్వల్లో పేరుకుపోయిన షిల్ట్‌ను జేసీబీ సాయంతో కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ శుక్రవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరువేరుగా చెత్త వాహనాలకు అందజేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే అనారోగ్యం పాలవుతారని, ఇళ్లను శుభ్రంగా ఉంచుకున్నట్లే వీధులను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో రూ.లక్ష ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, కాశిరెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

అమరచింత: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు కలిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి వినయ్ అన్నారు. నాగల్‌కడ్మూర్ రైతువేదికలో శుక్రవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగుకోసం ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ.4,200 పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం మొక్కను రూ.20 సబ్సిడీతో అందిస్తుందన్నారు. డ్రిప్ కోసం ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇవ్వగా,, బీసీలకు 90 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు వెల్లడించారు. తక్కువ పెట్టుబడితో ఏడాదికేడాది పంట దిగుబడి పెరుగుతూ రైతుకు లాభాలను ఇస్తున్న ఆయిల్‌పాం పంటలను సాగుచేసుకోవాలని కోరారు. పచ్చిరొట్ట, జీలుగ, జనుము పంట గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ఏఈఓ హరిత తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు రేమద్దుల, దొండాయిపల్లి గ్రామాల్లోని రైతువేదికల్లో శుక్రవారం ఆయిల్‌పాం సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రైతులు ఒకే పంటను సాగు చేయకుండా ఆయిల్‌పాం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి లాభాలను పొందాలన్నారు. వేసవిలో దుక్కులను దున్నడంతో కలిగే లాభాలు, పచ్చిరొట్ట ఎరువుల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సింగిల్ విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 65 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సజీద్ రహిమాన్, సర్పంచ్‌లు మంజుల, శ్యామల, గోపాల్‌రెడ్డి, ఏఈఓలు లింగస్వామి, మహేశ్వరి, నరేష్, రైతులు పాల్గొన్నారు.



తల్పునూర్‌లో మాట్లాడుతున్న ఏఓ అనిల్‌కుమార్



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఏడీఏ చంద్రశేఖర్



నాగల్‌కడ్మూర్‌లో..

గోపాల్‌పేట: రైతులు ఆయిల్‌పాం పంటలను సాగు చేసుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రేవల్లి అగ్రికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన రేవల్లి మండలంలోని తల్పునూర్‌లో రైతులకు ఆయిల్‌పాం తోటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో లోతు దుక్కులు చేసుకున్నట్లయితే భూమిలో ఉన్న కీటక అవశేషాలు నశించి పంటను తెగుళ్ల బారి నుంచి కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. భూసారం పెంచుకునేందుకు జీలుగ, పిల్లిపెసర పంటలు సాగు చేసి యాభైశాతం పంట వచ్చిన తర్వాత పొలంలో కలియ దున్ని భూసారం పెంచుకోవాలని, సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కుర్మతిరెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సీసీరోడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాత వస్తువులు అప్పగించాలని పురచైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాతబట్టలు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు, పాత వస్తువులను సేకరించారు. పాత వస్తువులు ఇళ్లల్లో నిల్వ ఉండడటం కారణంగా చెత్త పేరుకుపోయి అనారోగ్యం పాలు కావాల్సి వస్తుందన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి అందరూ ఆరోగ్యంగా ఉండాలని పురచైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో ముమ్మరంగా పారుశుద్ధ్య పనులను చేపట్టారు. చెత్తను బయట పారబోయకుండా చెత్త డబ్బాల్లో వేసి చెత్తబండికి అందించాలని కోరారు.

సీసీరోడ్లు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు

మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే జాతర మైదానంలోని మినీ స్టేడియంలో రూ.10 లక్షలతో వాకింగ్‌ట్రాక్ నిర్మాణ పనులను చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను శుక్రవారం సర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టి, తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

గోపాల్‌పేట: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్స్, డ్రైవర్స్ తదితరుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గోపాల్‌పేట సర్పంచ్ శ్రీనుకు శుక్రవారం పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. పీఆర్సీలో చెప్పిన విధంగా కనీస వేతనం చెల్లించాలని, 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ప్రస్తుతం ఉన్న జనాభా పరంగా కార్మికులను నియమించాలని కోరారు. ప్రతి నెలా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని, జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్లు కాకుండా అన్ని కేటగిరీలను కొనసాగించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

పైపులైన్ లీకేజీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో నీరంతా వృథా అవుతుంది. వాటర్‌ట్యాంకు నుంచి మండల కేంద్రానికి సరఫరా అయ్యే పైపులైనంతా లీకేజీలమయంగా తయారైంది. పోలీస్‌స్టేషన్ వద్ద రెండు చోట్ల లీకేజీ వల్ల నీరంతా వృథాగా పోతుంది. మసీదు వద్ద లీకేజీతో నీరు రోడ్డుపైన పారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల నుంచి లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీరంతా వృథా కావడంతో ప్రజలకు నీరు సరఫరాలకాక ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కొల్లాపూర్: ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు ఫీజుల దోపిడిని అరికట్టాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల పేరుతో రూ.వేల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. బ్రాంచ్‌ల పేరుతో అనుమతులు లేకున్నా పాఠశాలలను కొత్తగా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో శేఖర్, ఫయాజ్, రుక్మత్ ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని బోడబండతండా, సున్నపుతండాలో ఎక్సైజ్, పోలీసు అధికారులు, సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి పది లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశఋరు. సారా తయారు చేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

పెద్దకొత్తపల్లి: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని సూచించారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



అమరచింతలో..



దావాజిపల్లిలో మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీఓ, సర్పంచ్

అమరచింత: పట్టణ ప్రధాన రహదారిపై నిర్మించిన డివైండర్లపై నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. భగత్‌సింగ్ విగ్రహం నుంచి పెట్రోల్ బంక్ వరకు ఉన్న డివైడర్లపై నాటిన మొక్కలకు శుక్రవారం ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు. ఈమేరకు కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని రహదారులు, ప్రార్థన స్థలాలు, పాఠశాల ఆవరణల్లో హరితహారం ద్వారా నాటిన మొక్కలతో పాటు పార్కులలో పచ్చని గడ్డి పెరిగేలా ప్రతినిత్యం నీటిని అందిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి గ్రామాల్లో స్థానిక సర్పంచ్‌లతో కలిసి రోడ్డుకు ఇరువైపులా నాటిన, ప్రకృతి వనంలోని మొక్కలకు నీరు పట్టారు. దీంతో పాటు కమాన్ ఇంకుడు గుంతలు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో నూతన మొక్కలను నాటాలని, నర్సరీలలోని మొక్కలు ఏపుగా పెరిగేందుకు ఉదయం, సాయం కాలం వేళల్లో నీరు పట్టాలని సిబ్బందికి ఆదేశించారు. గోప్లాపూర్‌లో జరిగిన చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటయ్యయాదవ్, శ్యామల, రాణి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వెంచర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మహమ్మద్

- బఫర్ జోన్‌ల గుర్తింపుల్లో అవకతవకలు
- కేవీఆర్ వెంచర్‌ను పరిశీలించిన కమిషనర్
- టౌన్‌ప్లానర్‌కు ఫిర్యాదు

అమరచింత: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తూ.. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే వారిపై చర్యలు తప్పవని, అలాంటి వెంచర్లకు అనుమతులను నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. బీసీ కాలనీలో సర్వే నంబర్ 647లో సుమారు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో ఇటీవల నాలా పర్మిషన్ తీసుకొని, వెంచర్ ఏర్పాటు చేయడానికి డీటీపీసీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కేవీఆర్ వెంచర్‌గా నామకరణం చేసిన నిర్వాహకులు ఎత్తిపోతల కాల్వ, భీమా కాల్వలు వెంచర్ సమీపంలో వెళ్తున్నాయని, దీనికి ఇరిగేషన్ శాఖ అధికారుల సూచనల మేరకు స్థలాన్ని వదలకుండా వాటిలోనే మున్సిపాలిటీకి 10శాతం స్థలాన్ని కేటాయించారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం కమిషనర్ వెంచర్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. కెనాల్‌కు 17 మీటర్ల దూరంలో వెంచర్ ఉండాలని, వాటిని అతిక్రమించినట్లు గుర్తించామన్నారు. వీటికోసం టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. నీటిపారుదల కాల్వలు, చెరువులు ఉన్న చోట బఫర్ జోన్‌గా గుర్తించి భవిష్యత్‌లో వెంచర్‌లోని ఇంటి స్థలాలకు సీ పేజ్ రాకుండా ఉండేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు చూపిన విధంగా స్థలాలను వదలాలని ఆయన అన్నారు.

తొలగని 11కేవీ లైన్

కేవీఆర్ వెంచర్‌లో ఇప్పటి వరకు అన్ని పనులు పూర్తయ్యాయని, అనుమతులు ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్న సదరు యాజమాని ఇప్పటి వరకు 11 కేవీ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించలేదు. ఈవిషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు నివేదించి వాటిని తొలగించినపుడే అనుమతి ఇస్తామన్నారు.

సంపద వనాల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ నటరాజన్

పెద్దకొత్తపల్లి: పలు రకాల పండ్ల మొక్కలతో సంపదవనాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు ఏపీడీ నటరాజన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కేఎల్ఐ ప్రాజెక్టు రెండవ లిఫ్టు సమీపంలో సంపద వనాల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 30 ఎకరాల భూమిలో మూడు బ్లాకులు ఏర్పాటు చేసి పండ్ల మొక్కలను పెంచితే ప్రాజెక్టు సందర్శకులకు ఆకర్షనీయంగా ఉండాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది జూన్ మాసంలో ఈ సంపదవనాలలో పండ్ల మొక్కలు నాటేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏపీఓ మల్లికార్జున్, శీనయ్య ఉన్నారు.

విధిగా ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోండి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

వీపనగండ్ల: ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో ప్రజలు తమ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ కతలప్ప కోరారు. శుక్రవారం పుల్గర్‌చర్లలోని ఆధార్‌కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు అప్‌డేషన్ గడువు ముగిస్తే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఆధార్ అప్‌డేషన్ కోసం వెళ్లే ప్రజలు రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఓటర్‌కార్డులో ఏదైనా రెండింటిని అప్‌డేషన్ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆధార్ అప్‌డేషన్ ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎద్దుల సురేందర్ రెడ్డి, వీఆర్‌ఏ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శాగాపూర్ ఏఎన్‌ఎం సుమిత్ర అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా శాగాపూర్‌లోని పలు కాలనీల్లో పర్యటించి బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ఒక్కరోజు నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయన్నారు. చెత్తను ఇష్టానుసారంగా పారబోయకుండా జీపీ వాహనం వచ్చినప్పుడు అందులో వేయాలని కోరారు. రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనికయాదవ్, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతియాదవ్, డా.తిరుపతయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి



మాట్లాడుతున్న నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలో రైతువేదికల క్లస్టర్ల వారిగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను గుర్తించనున్నట్లు ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ మండల కార్యాలయంలో మండల రైతు సమితి కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అధ్యక్షతన ముఖ్య నాయకులు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బాలీశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ సత్యం, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు విక్రం తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. అయినప్పటికీ గ్రామ స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం క్లస్టర్ల వారిగా వారిగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29న మామిడిమాడలో మొదటి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. తరువాత మిగతా క్లస్టర్లలో తేదీలను నిర్ణయిస్తామని వారు చెప్పారు.

జీఓ 21ను తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సురేష్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్‌వైజర్ తదితర కార్మికుల సంక్షేమం కోసం తెచ్చిన జీఓ నెంబర్ 21ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆస్పత్రి కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ జీఓ అమలు చేస్తే ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు రూ.20వేల నుంచి రూ.26 వేల వరకు పెరుగుతాయన్నారు. తాజాగా ప్రభుత్వం పీఆర్సీ జీఓ 61 ని అమలు చేస్తామని, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.15,600 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఒకే వేతనం అందిస్తామని చెప్పిందన్నారు. కానీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కార్మికులు సాయికృష్ణ, మునిందర్, భీమయ్య, శివ, నాగయ్య, సంగీత, పద్మ, భాగ్యమ్మ, ప్రియాంక, నబియా, స్వాతి, రంగమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వీఓఏలు

మదనాపురం: మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.26 వేల వేతనం, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 40 రోజులు పాటుగా నిదవధిక సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు అలివేల, కార్యదర్శి స్వప్న, సహాయ కార్యదర్శి రజిత, జయమ్మ, శ్రీలత, సంధ్య, అరుణ, రూప, పద్మ, శ్రీమణి, నారాయణ, మునికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' నీటి సరఫరాలో అంతరాయం

- నాలుగు రోజులుగా అందని తాగునీరు
- ఇబ్బందులు పడుతున్న తెల్లరాళ్లపల్లితండా వాసులు



ట్యాంకర్‌తో అందిస్తున్న తాగునీరు



తండాలో వృథాగా ఓవర్‌హెడ్ ట్యాంకు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటికి తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ శాంతమ్మ శుక్రవారం పేర్కొన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నెలలో ఐదు, ఆరు రోజులు భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఈ సమయంలో తాగునీటికి తండా వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. తండాలో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకుకు ఉన్న పైపులైన్లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా కావడం లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు కలెక్టర్, సంబంధిత అధికారులు, కొల్లాపూర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌కు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని, లేకపోతే తండావాసులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్, తండావాసులు పాల్గొన్నారు.